TELTEL/2023/87917

# జనం వెలుగు

అనునిత్యం అక్షరసత్యం

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com



విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 02 | సంచిక : 339 | శనివారం 01 - 03 - 2025 | ఎడిటర్ : సీతార్ల సురేష్ | పేజిలు : 8 | వెల : 6 /-


# మీనాక్షి నాటరాజన్ పై తెలంగాణ కాంగ్రెస్ కోటి ఆశలు

**జనంవెలుగు, హైదరాబాద్, ఫిబ్రవరి 28:-** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. గాంధీ భవన్ వ్యూహాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలున్నాయి. అయితే ప్రతిపక్షాలు చేసే విమర్శలు, వారి రచ్చకంటే సొంత పార్టీలోనే కుమ్ములాటలు పీక్స్ లో ఉంటాయి. ఏ రోజూ మీడియా బ్రేకింగ్స్ కు తక్కువ కాకుండా మాంచి స్టఫ్ ఇస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే బిఆర్ ఎస్ చేసే విమర్శల కంటే సొంతపార్టీ నేతలే తమ పార్టీ మంత్రులు, ముఖ్యమంత్రులపై చేసుకునే విమర్శలే మాంచి ఘాటుగా ఉంటాయి. అంతలా విభేదాలకు కేరాఫ్ అడ్రస్ గాంధీ భవన్ అనేలా తాజా పరస్దితులు తయారయ్యాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్న సమయంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జిగా బాధ్యతలు తీసుకుని, తొలిసారి హైదరాబాద్ కు వచ్చిన మీనాక్షీ నటరాజన్ పైనే కాంగ్రెస్ క్యాడర్ గంపెడు ఆశలు పెట్టుకుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధిక్షారానికి దూరంగా ఉన్నప్పుడు ఇంట్లో గొడవలు సర్దుకున్నాం. ఇప్పుడు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఏంటీ రచ్చ అంటూ కొందరు నేతలు ఇప్పటికే మీనాక్షి నటరాజన్ కు తెలంగాణలో పరిస్దితులు వివరించినట్లు సమాచారం. మీనాక్షి నాటరాజన్ అందరిలాకాదు. విభిన్నమైన నేతల్లో ఒకరామె. మధ్యప్రదేశ్ కు చెందిన ఈమె మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని, పార్టీలోనే కొనసాగడం మాత్రమేకాదు. పార్టీ కోసం కష్టపడే ,నిజాయితీ గల నేతల్లో ఈమె ముందు వరుసలో ఉంటారు. హంగు, ఆర్భాటాలకు దూరంగా, అవినీతికి మరింత దూరంగా ఉండే మీనాక్షికి ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ లో విభేదాలను



సర్దుబాటు చేయడం మాత్రమేకాదు, మరోసారి అధికారంలోకి వచ్చేలా ఇప్పటి నుండే కేడర్ ను బలోపేతం చేసేలా అధిష్టానం పెద్ద టాస్క్ ఇచ్చింది. అందుకే అన్నీ ఆలోచించి, ఆ సమర్ధత ఉన్న నేత కాబట్టే మీనాక్ష్మీ నటరాజన్ ను రంగంలోకి దింపింది అధిష్టానం. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే పార్టీకి మంచి మైలేజి వస్తుందని అధిష్టానం పెట్టుకున్న అంచనాలు అంతలా ఫలించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బయటవాళ్లు సరే, ముందు సొంత పార్టీలోని కొందరు బిసి నేతలే కులగణనపై నిప్పులు చెరుగుతున్నారు. తప్పుల తడకగా ప్రచారం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆరు గ్యారెంటీలు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ , అవి అమలు చేస్తున్నామని చెబుతున్నా, ఆశించిన స్దాయిలో మైలేజ్ పొందలేకపోతోంది. దీనికి తోడు మెట్రో విస్తరణ, మూసీ అభివృద్ధి అంటూ ఎత్తుకున్న కొత్త సవాళ్లు తలపోటుగా మారాయి. వీటివల్ల పార్టీకి నష్టం జరగకుండా చూడాల్సిన అవసరం ఉంది. క్రిందిస్దాయి కేడర్ మనో ధైర్యం సడలకుండా , భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది. మరో పార్టీ వైపు వలసలు లేకుండా అడ్డుకట్ట వేయాల్సిన పరిస్దితులున్నాయి. ఇదిలా ఉంటే ఇటీవల కాలంలో కొందరు నేతలు చేస్తున్న విమర్శలు పార్టీలో కులాల మధ్య చిచ్చుపెడుతున్నాయి. ఇంటి గుట్టు బజారుపాలు అన్నట్లుగా ఇష్టమొచ్చినట్లు నేతలు చేస్తున్న విమర్శలు పార్టీ పరువు తీసేలా ఉన్నాయి. ఏకంగా ముఖ్యమంత్రిని కూడా వదలకుండా సొంత పార్టీల్లో అసమ్మతి పీక్స్ కు చేరుకుంది. ఈ నేపధ్యంలో నేతల మధ్య సయోధ్యత కుదర్చడంతోపాటు, హద్దుమీరుతున్న నేతలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. దీనికి తోడు ముఖ్యంగా గతంలో ఇన్ ఛార్జ్ మార్పుకు ప్రధాన కారణమైన కొత్త,పాత నేతల మధ్య విభేదాలను తక్షణం గాడిలో పెట్టడంతోపాటు, పార్టీని దశాబ్ధాలుగా నమ్ముకున్న క్యాడర్ కు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది. ఇలా ఓవైపు ప్రభుత్వ నిర్ణయాల ప్రభావం, మరోవైపు నేతల మధ్య విభేదాలకు ముగింపు ఇప్పుడు తెలంగాణ కొత్త బాస్ మీనాక్షి నటరాజన్ పై ఉంది. కేంద్ర పెద్దలు నమ్మినట్లు పనిరాక్షసిలా పోరొందిన మీనాక్షి.

# కన్నతల్లిలా ప్రేమ చూపండి


## కిషన్ కు రేవంత్ లేఖ

**జనంవెలుగు, హైదరాబాద్, ఫిబ్రవరి 28:-** దేశంలో తెలంగాణ రాష్ట్రం ఉందని ముందు గుర్తించండి. కేంద్ర మంత్రి స్థానంలో ఉన్న మీరు.. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర హక్కులను సాధించడంపై దృష్టి సారించండి. బెంగుళూరు, చెన్నై నగరాలపై చూపుతున్న ప్రేమ హైదరాబాద్ నగరంపై ఎందుకు చూపలేక పోతున్నారని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇటీవల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా చేసిన కామెంట్స్ పై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం ఆయనకు లేఖ రాశారు. రాష్ట్రంపై కేంద్రం చూపుతున్న వివక్షను సీఎం లేవనెత్తుతూ సీఎం లేఖలో పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖ ఆధారంగా.. సొంత రాష్ట్రం కంటే ఇతర రాష్ట్రాలకే తెలంగాణకు చెందిన కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిలో ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రాజెక్ట్ ల మంజూరులో కేంద్ర మంత్రిగా మీ బాధ్యత గుర్తు చేస్తున్నానంటూ, సీఎం లేఖలో పలు విషయాలను ప్రస్తావించారు. రాష్ట్రాలకు ప్రాజెక్టుల మంజూరులో కేంద్రానికి ఒక విధానం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారంటూ.. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న మీరు వ్యాఖ్యలు చేయడం పూర్తి బాధ్యతారాహిత్యమన్నారు. తెలంగాణలో 2023, డిసెంబరు 7న ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచే పూర్తి బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పాలన సాగుతోందన్నారు.భారత రాజ్యాంగంలో పేర్కొన్న సమాఖ్య విధానానికి పూర్తిగా కట్టుబడి ఉండి తమ సర్కార్ నడుచుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల సాధన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే తెలంగాణ అభివృద్ధికి కీలకమైన హైదరాబాద్ మెట్రో ఫేజ్-11, ప్రాంతీయ రింగు రోడ్డు ఆర్ఆర్ఆర్, మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రైలు, డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని బందరు సీ పోర్ట్ కు గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణాల సాధనకు కేంద్ర ప్రభుత్వ విధివిధానాలను పూర్తిగా పాటిస్తున్నామన్నారు. ఈ విషయం మీకు స్పష్టంగా తెలుసు కానీ, ఆయా ప్రాజెక్టుల సాధనకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులతో పాటు కిషన్ రెడ్డిని కలిసిన విషయాన్ని గుర్తు చేయాలనుకుంటున్నట్లు సీఎం తెలిపారు.తెలంగాణకు జీవనాడి అయిన హైదరాబాద్ నగరంలో మెట్రో ఫేజ్ -1 69 కి.మీ నిర్మాణాన్ని ఉమ్మడి రాష్ట్రంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. మెట్రో రాకతో హైదరాబాద్ నగరంలో అభివృద్ధి పరుగులు పెట్టిందని లేఖలో వివరించారు. గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టపై పూర్తిగా నిర్లక్ష్యం వహించిందన్నారు. ముఖ్యమంత్రిగా తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత హైదరాబాద్ మెట్రో ఫేజ్-11 ప్రాజెక్టులపై పూర్తి దృష్టిసారించినట్లు తెలిపారు. హైదరాబాద్ నలుమూలలను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులకు వీలుగా మెట్రో సేవలను విస్తరించడమే లక్ష్యంగా 5 కారిడార్లను ప్రతిపాదించామన్నారు.నాగోల్ - రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం 36.8 కి.మీ. రాయదుర్గం - కోకాపేట నియోపొలిస్, ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట 7.5 కి.మీ, మియాపూర్ - పటాన్ చెరు 13.4 కి.మీ, ఎల్ బీ నగర్ - హయత్ నగర్ 7.1 కి.మీ మార్గాల నిర్మాణానికి రూ.24,269 కోట్లతో ప్రతిపాదనలు ఆమోదించాలని నాటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ



మంత్రి హర్దీప్ సింగ్ పురికి 2024, జనవరి 4వ తేదీన వినతిపత్రం అందజేసిన విషయాన్ని సీఎం లేఖలో వివరించారు. తర్వాత 2024, అక్టోబరు ఏడో తేదీన ప్రస్తుత కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కు ప్రతిపాదనలు అందజేశానన్నారు. 2024, డిసెంబరు 12వ తేదీన ఢిల్లీలో మీతో సమావేశమై హైదరాబాద్ మెట్రో ఫేజ్-11 ప్రాజెక్ట్ కు సంబంధించిన వివరాలను తెలియజేసి లేఖను అందజేసినట్లు కిషన్ రెడ్డికి సీఎం గుర్తు చేశారు.ఈ ఏడాది జనవరి 24న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్లాల్ ఖట్టర్ హైదరాబాద్ వచ్చిన సందర్భంలో ఆయనను కలిసి మెట్రో ఫేజ్-11 ప్రాధాన్యాన్ని సవివరంగా తెలియజేసినట్లు సీఎం లేఖలో వివరించారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు ఇదే అంశంపై లేఖ అందజేశానన్నారు. మెట్రో ఫేజ్-II%Å£" కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టాలని అన్ని లేఖల్లో స్పష్టంగా వివరించాం. నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత, తెలంగాణ నుంచి మీరు కేంద్ర మంత్రిగా ఉన్న కాలంలోనే 2021, ఏప్రిల్లో బెంగళూర్ మెట్రో ఫేజ్-11 అంచనా వ్యయం రూ. 14,778 కోట్లు, 2024 ఆగస్టులో బెంగళూర్ మెట్రో ఫేజ్-1 అంచనా వ్యయం రూ.15,611 కోట్లు, 2024, అక్టోబరులో చెన్నై మెట్రో ఫేజ్-11 అంచనా వ్యయం రూ.63,246 కోట్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావు పై మరో కేసు నమోదు



**జనంవెలుగు, హైదరాబాద్:-** బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావుపై మరో కేసు నమోదు అయింది బాచుపల్లి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. హరీష్ రావు ఆయన అనుచరులు బెదిరిస్తున్నారని కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఏ -1 గా వంశీ కృష్ణ, ఏ -2 గా హరీష్ రావు, ఏ-3 సంతోష్ కుమార్, ఏ -4 గా పరుశురాములు పేర్లు చేర్చారు. బీఎస్ఎన్ యాక్ట్, ప్రకారం కేసు నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరస్టయి బెయిల్పై విడుదల అయిన సమయంలో వంశీకృష్ణ జైలు వద్ద మీడియాతో మాట్లాడారని దర్యాప్తు చేస్తున్న పంజాగుట్ట పోలీసులను విమర్శించడంతోపాటు, తనపై ప్రతీకారం తీర్చుకుంటామని వంశీకృష్ణ మాట్లాడినట్లు చక్రధర్ గౌడ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే వంశీకృష్ణ చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి అభ్యంతకరమైన మాటలు లేవని తనను అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించారని, న్యాయపోరాటం కొనసాగిస్తానని చెప్పడం వలనే తనపై అక్రమంగా కేసులు పెట్టారని వంశీ చెబుతున్నారు. కాగా ఈ కేసుకు సంబంధించి పోలీసుల దర్యాప్తు ఎలా ఉండబోతోందో చూడాలి. గత ప్రభుత్వానికి అడ్డు తగిలిన వ్యక్తులను ఒక్కొక్కరిగా చంపేసుకుంటూ వస్తున్నారని, వాళ్లకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని ఆ పార్టీ నేత చక్రధర్ గౌడ్ అన్నారు. తనకూ ప్రాణహాని ఉందని తన అంతు చూస్తామంటూ సోషల్ మీడియా వేదికగా బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజం కోసం కొట్లాడుతున్న గొంతుకలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. చావు ఏదో ఒకరోజు తప్పదు. కానీ సమాజం కోసం పోరాడి చావడానికి సిద్ధమేనన్నారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా వ్యక్తి స్వేచ్ఛను హరించారని కోర్టు మెట్లెక్కిన మొట్టమొదటి వ్యక్తిని తానేనన్నారు. కేసు వెనక్కి తీసుకోమని కొన్ని శక్తులు తనను వెంటాడుతున్నాయన్నారు. ఈ క్రమంలో తనకు ఏమౌతుందోనని తన కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారని ఆయన అన్నారు. కాగా మాజీ మంత్రి హరీష్రావు తన ఫోన్తో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితుల ఫోన్లను ట్యాప్ చేయించాడని సిద్దిపేట కాంగ్రెస్ నేత చక్రధర్గౌడ్ ఆరోపించారు. తన ఫోన్ ట్యాప్ అయిందంటూ గత ఏడాది జూన్ 19న చక్రధర్గౌడ్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు పట్టించుకోక పోవడంతో కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు చక్రధర్గౌడ్ను గతంలో విచారించిన పోలీసులు సరైన ఆధారాలు తీసుకు రావాలని సూచించారు. ఈ మేరకు చక్రధర్గౌడ్ జూబ్లీహిల్స్ ఏసీపీని కలిసి ట్యాప్ అయినట్టు అనుమానిస్తున్న సెల్ఫోన్తో పాటు యాపిల్ కంపెనీ నుంచి ఫోన్ ట్యాప్ అయిందని వచ్చిన మెయిల్ కాగితాలు, ఇతర వివరాలను విచారణ అధికారులకు అందచేశారు. హరీశ్రావుకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాననే కక్షతో తనపై అనేక కేసులు పెట్టి జైలుకు పంపించారని చక్రధర్గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రంగనాయకసాగర్ కుంభకోణాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది తానేనని ఆయన వెల్లడించారు.

# పింక్ బుక్ అమలు చేస్తాం

**జనంవెలుగు, నాగర్ కర్నూలు:-** నాగర్ కర్నూల్ జిల్లా సింగోటంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేసారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు పై ఎమ్మెల్సీ కవిత ఫైర్ అయ్యారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా నుంచి చెబుతున్నా కచ్చితంగా పింక్ బుక్కు మైంటైన్ చేస్తాం. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే ఎంత పెద్ద నాయకులైనా, అధికారులనైనా ఎవరిని వదిలిపెట్టం. పింక్ బుక్కులో అందరి చిట్టా



రాసుకుంటాం. మాకు కూడా టైం వస్తుంది. అప్పుడు అందరి సంగతి చెప్తాం. మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ కార్యకర్తలను తీవ్రంగా వేధిస్తున్నారు. చిన్న విమర్శ చేసినా, ప్రశ్నించినా అక్రమ కేసులు పెట్టిస్తున్నారు. శ్రీధర్ రెడ్డి అనే కార్యకర్తను దారుణంగా చంపేసినప్పటికీ పోలీసులు కేసు దర్యాప్తును ముమ్మరం చేయడం లేదు. కాంగ్రెస్ నాయకులు హంతకులకు కొమ్ముకాస్తున్నారు. తమ మీటింగు కోసం ఫ్లెక్సీలు కడితే పరమేశ్వర్ అనే కార్యకర్తపై జూపల్లి దాడి చేయించారు. ఇదేమి రాజ్యం? కాంగ్రెస్ నాయకులు ఎందుకు భయపడుతున్నారు? కొల్లాపూర్ నియోజక వర్గానికి జూపల్లి కృష్ణారావు టూరిస్ట్ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఎప్పుడో ఒకసారి మాత్రమే ఆయన నియోజకవర్గానికి వస్తున్నారు. సన్న వడ్లకు బోనస్ అని చెప్పి భోగస్ చేసిన ప్రభుత్వం. రైతు భరోసా, రుణమాఫీ గ్రామాల్లో సగం మందికి కూడా రాలేదని అన్నారు.

# బావిలో పడిన జింకను కాపాడిన గ్రామస్థులు

**జనంవెలుగు, నిర్మల్:-** నిర్మల్ జిల్లా కడెం మండలం చిట్యాల్ గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో జింక పడి బయట పడేందుకు తిప్పలు పడింది. ఆ బావి నుంచి బయట పడేందుకు ప్రాణాలతో కొట్టుమిట్టులాడుతుండగా అటు మీదుగా వ్యవసాయ పనులకు వెళ్తున్న గ్రామస్తుల కంట పడింది. గ్రామానికి చెందిన జైపాల్, అనంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి లు గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించి జింకను బావిలో నుండి బయటకు తీశారు.. అనంతరం అటవీ అధికారులకు అప్పగించారు.అదుపులోకి తీసుకున్న వన్యప్రాణిని సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు కడెం ఎఫ్ఆర్ఓ గీతరాణి తెలిపారు. వన్యప్రాణిని కాపాడిన గ్రామస్తులను ఆమె అభినందించారు.

జనంవెలుగు
TELTEL/2023/87917

జనరల్ న్యూస్

శనివారం
01 - 03 - 2025



# మాక్లూర్ పీ.హెచ్.సీ ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

## గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల సందర్శన

**జనంవెలుగు, నిజామాబాద్, ఫిబ్రవరి 28 :** మండల కేంద్రమైన మాక్లూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలియాతండాలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ బాలికల మినీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. స్థానికంగా నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, రోగులకు అందిస్తున్న చికిత్సల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించి పీ.హెచ్.సీ నిర్వహణ తీరును గమనించారు. అన్ని రకాల ఔషధాలు సరఫరా అవుతున్నాయా అని ఆరా తీశారు. రక్తపోటు, డయాబెటిక్ పరీక్షలు ప్రతి రోజు సగటున ఎంత మందికి నిర్వహిస్తున్నారు, రాపిడ్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వాక్సినేషన్ రూంను సందర్శించి శీతలీకరణ ఉంచిన వాక్సిన్ లను, స్టోర్ రూంలో మందుల గడువు తేదీలను పరిశీలించారు.





ఆసుపత్రి ఆవరణ, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కనీసం రెండు రోజులకు ఒకసారి అయినా ఆసుపత్రి పరిసరాలు శుభ్రం చేసేలా సిబ్బందిని కేటాయించాలని స్థానిక ఎంపీఓ ను ఆదేశించారు. స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను, సిబ్బందిని ఆదేశించారు.

అనంతరం కలెక్టర్ ఎలియాతండాలో గిరిజన సంక్షేమ బాలికల మినీ గురుకులాన్ని సందర్శించి, విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. కొత్త బియ్యం కేటాయించడం వల్ల అన్నం కాస్తంత మెత్తగా అవుతోందని నిర్వాహకులు తెలుపగా, గురుకులానికి కేటాయించిన బియ్యం నాణ్యతను కలెక్టర్ తనిఖీ చేశారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి నాణ్యమైన సన్నబియ్యం కేటాయించాలని ఆదేశించారు. స్టోర్ రూమ్ లో నిలువ ఉంచిన ఆహార పదార్థాలు, కూరగాయలు, వంట నూనె ప్యాకెట్లు, పసుపు, కారంపొడి ప్యాకెట్లను, ఇతర సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. నాణ్యతతో కూడిన పౌష్టిక ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. కలెక్టర్ వెంట మాక్లూర్ డిప్యూటీ తహసీల్దార్ పద్మలత, గురుకుల పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ విద్యారాణి తదితరులు ఉన్నారు.

# ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## సెల్ ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దు
## పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు
## వీ.సీ ద్వారా కలెక్టర్లు, ఎస్పీలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష

**జనంవెలుగు, నిజామాబాద్, ఫిబ్రవరి 28:** కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. ఈ నెల 5వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో సీ.ఎస్ శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ఎలాంటి పొరపాట్లకు, కాపీయింగ్ కు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సాఫీగా పరీక్షలను నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాలలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్లను అనుమతించకూడదని, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్ లతో పాటు కేంద్రాలను తనిఖీ చేసేందుకు వెళ్లే అధికారులు సైతం సెల్ ఫోన్ లు తీసుకెళ్లకూడదని ఆదేశించారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తరువాతనే లోనికి అనుమతించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులకు కీలక సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తీసుకురావడం మొదలుకుని, పరీక్షలు ముగిసిన మీదట ఆన్సర్ షీట్లను నిర్ణీత పాయింట్ కు తరలించేంతవరకు ఎంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి కేంద్రంలోనూ పరీక్షల నిర్వహణ తీరును చీఫ్ సూపరింటెండెంట్ లు నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏఎన్ఎం లు, ఆశా వర్కర్ లతో పాటు ఏ ఒక్కరు కూడా పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు తీసుకెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్షలు ప్రారంభం కావడానికి ముందే కేంద్రాలను సందర్శించి తాగునీటి వసతి, సరిపడా ఫర్నీచర్, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేవా అన్నది పరిశీలించాలని తహశీల్దార్లకు సూచించారు. పరీక్షా సమయాలకు అనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్ కో ఎస్.ఈ రవీందర్ కు సూచించారు. నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నపత్రాలు



కేంద్రాలకు చేర్చాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, తగిన సంఖ్యలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించి, కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని అన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, వార్షిక పరీక్షలకు సంబంధించి వారికి ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డీఐఈఓ ను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు డీసీపీ బస్వారెడ్డి, డీఐఈఓ టి.రవికుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇంచార్జ్ జిల్లా రిజిస్ట్రార్ రమేష్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీపీఓ శ్రీనివాస్, డీఈఓ అశోక్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, ట్రాన్స్కో ఎస్.ఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 31లోపు ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులు చేసుకుంటే 25 శాతం రిబేటు

## కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి
## మున్సిపల్ కార్యాలయాల్లో సహాయక కేంద్రాలు

**జనంవెలుగు, నిజామాబాద్, ఫిబ్రవరి 28 :** ప్లాట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకునే వారికి ప్రభుత్వం 25 శాతం రిబేటు సౌకర్యాన్ని వర్తింపజేస్తోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. నాన్ లేఅవుట్ ప్లాట్లు కలిగి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి శుక్రవారం సాయంత్రం ఎల్.ఆర్.ఎస్ అంశంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. అనంతరం కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నాన్ లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణకు రిబేటు సదుపాయం కల్పించినందున, ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. 2020 ఆగస్టు 26వ తేదీ లోపు దాఖలైన ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులకు మాత్రమే ఇదివరకు క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించగా, ప్రస్తుతం ఆ గడువును ప్రభుత్వం ఎత్తివేస్తూ కొత్తగా దరఖాస్తులు చేసుకునేందుకు



వెసులుబాటు కల్పించిందని కలెక్టర్ తెలిపారు. ఎల్.ఆర్.ఎస్ కోసం దరఖాస్తులు చేసుకునే వారికి తగిన సమాచారం తెలియజేస్తూ, వారి సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలలో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. అదేవిధంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లోనూ కంట్రోల్ రూమ్ నెంబర్ 08462 - 220183 కు కార్యాలయాల పని వేళల్లో సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు. కాగా, పెండింగ్ లో ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సర్వే నెంబర్లు, ప్లాట్ అప్లికేషన్ల సంఖ్య, రోడ్డు విస్తీర్ణం, ఇనాం భూమి, ఇరిగేషన్ ల్యాండ్ వంటి అంశాలను పక్కాగా పరిశీలన జరపాలన్నారు. రఖాస్తుదారులను అనవసర ఇబ్బందులకు గురిచేయకూడదని, క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్ళడానికి ముందే దరఖాస్తుదారులకు సమాచారం అందిస్తే, వారు ప్లాట్ స్థలంలో అందుబాటులో ఉంటారని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా అది ప్రైవేట్ స్థలమేనా లేక ప్రభుత్వ స్థలమా అన్నది అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా నిర్ధారించుకోవాలని అన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పాదదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ప్రగతి కనిపించేలా అంకితభావంతో పని చేయాలని, వారం రోజుల అనంతరం మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓల సంఘం నిజామాబాద్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



**జనంవెలుగు, నిజామాబాద్:–** అధ్యక్షుడిగా గంగుల సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస రావు నిజామాబాద్ జిల్లా ఎంపిడిఓల సంఘం 2025–2027 కాలానికి కొత్త జిల్లా కార్యవర్గం ఎన్నికలు ఈ రోజు DRDO కార్యాలయంలో CEO ZP & ఎన్నికల అధికారి సాయ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. ఎంపిడిఓల సమావేశంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.

**కొత్త జిల్లా కార్యవర్గం:**

అధ్యక్షుడు – గంగుల సంతోష్ కుమార్
ప్రధాన కార్యదర్శి – శ్రీనివాస రావు
కోశాధికారి – రాం నారాయణ
ఉపాధ్యక్షుడు 1 – నీలవతి
ఉపాధ్యక్షుడు 2 – రాములు నాయక్
జాయింట్ సెక్రటరీ – వెంకటేశ్వర్లు
ఆర్గనైజింగ్ సెక్రటరీ – నాగ్ నాథ్
పబ్లిసిటీ సెక్రటరీ – సతీష్ కుమార్
ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ – బాల కిషన్, శంకర్, తిరుమల, రాజా శ్రీనివాస్

ఈ ఎన్నికల సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు సంఘ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## బాలనగర్ పాఠశాలలో విజ్ఞానోత్సవం ఘనంగా నిర్వహణ



**జనంవెలుగు, జక్రాన్ పల్లి:–** జజక్రాన్ పల్లి మండలం బాలనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ విజ్ఞాన చార్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయురాలు సునీత ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశామాంజస ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, విట్టల్ రావు, సుజాత, రేవతి, నరసయ్య పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

## మహిళలకు ఆర్థిక అక్షరాస్యత ఎంతో అవసరం
## అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



**జనంవెలుగు, నిజామాబాద్, ఫిబ్రవరి 28:** మహిళలకు ఆర్థిక అక్షరాస్యత ఎంతో అవసరమని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా 'పొదుపు చేసే మహిళా సాధిస్తుంది ఘనత' అనే అంశం పై లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు డబ్బులను పొదుపు చేసుకోవడానికి బడ్జెట్ను రూపొందించుకోవాలని, అనవసరమైన ఖర్చులను తగ్గించి, వ్యాపార లావాదేవీల ద్వారా లాభాలు ఆర్జించడమే కాకుండా, ఆర్థికపరమైన నిర్వహణ అంశాల గురించి కూడా అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. వేతనాలు పొందేవారు, వ్యాపారాలు చేసేవారు, గృహిణులు సురక్షితమైన పొదుపు మార్గాలను ఎంచుకొని భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు పొదుపు చేసుకోవాలని హితవు పలికారు. ప్రైవేట్ సంస్థలు, వ్యక్తుల నుంచి వివిధ అవసరాల కోసం రుణాలు తీసుకుంటే అధిక వడ్డీలు చెల్లించాల్సి వస్తుందని, తద్వారా ఆర్థికంగా నష్టం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న తోడ్పాటును పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక అక్షరాస్యతను పాటించడం ద్వారా ఆర్థిక పురోగతి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు ముద్రించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ సాయాగౌడ్, లీడ్ బ్యాంకు మేనేజర్ అశోక్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ బ్యాలెట్ బాక్సులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సులకు యాక్సిడెంట్

**జనంవెలుగు, కరీంనగర్, ఫిబ్రవరి 28:–** తెలంగాణ రాష్ట్రంలో గురువారం (ఫిబ్రవరి 27) పట్టభద్ర, ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అయితే ఎన్నికల విధులు ముగించుకుని బ్యాలెట్ బాక్సులను అప్పగించేందుకు వెళ్తున్న 2 ఆర్టీసీ బస్సులకు అనుకోని రీతిలో ప్రమాదం జరిగింది. దీంతో బస్సులోని ఎన్నికల సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. అసలేం జరిగిందంటే..తెలంగాణలోని పలు జిల్లాల మాదిరిగానే గురువారం సాయంత్రం కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిమాజామాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిశాయి. బ్యాలెట్ బాక్సులను కరీంనగర్‌లో అప్పగించేందుకు నిర్మల్ జిల్లా ఎన్నికల సిబ్బంది రెండు ఆర్టీసీ బస్సుల్లో బయల్దేరారు. ఈ క్రమంలో జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలికొండ వద్దకు చేరుకోగానే నిర్మల్–బాన్సువాడకు చెందిన బస్సులు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఎన్నికల సిబ్బంది ఉన్న బస్సుల్లో ప్రయాణిస్తున్న 19 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులోని క్షతగాత్రులను కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. బస్సు డ్రైవర్ మోయినోద్దీన్, పురుషోత్తం అనే అధికారి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. బస్సులో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరు మినహా మిగతా అందరూ గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.కాగా తెలంగాణ రాష్ట్రంలో ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ మార్చి 3న కరీంనగర్, నల్గొండ జిల్లా కేంద్రాల్లో జరగనుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపుకు మూడు రోజులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపుకు మరో 36 గంటల చొప్పున సమయం పట్టవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు.